
సీఎం జగన్ రాక కోసం ఇసుకతోట జంక్షన్‌లో ఫుట్‌పాత్‌పై కూర్చుని ఎదురుచూస్తున్న పెన్షనర్లు


పెదవాల్తేరులో బైక్ ర్యాలీలో పాల్గొన్న యువత


28వ వార్డులో పార్టీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


జగన్‌ను చూసేందుకు చిన్నారితో వచ్చిన మహిళ

జగన్ కోసం.. జనోత్సాహం


ఇసుకతోట కృష్ణుడి గుడి వద్ద వేచి ఉన్న మహిళలు

మా ఆత్మీయుడొచ్చాడంటూ అక్కాచెల్లెళ్లు తరలివచ్చారు..
మా మనవడ్ని చూడాలని అవ్వాతాతలు మండుటెండను సైతం లెక్కచేయలేదు..
జగనన్నతో ఒక్క ఫొటో అయినా తీసుకోవాలని యువతరం ఉత్సాహం చూపింది..
అన్నివర్గాల చూపు సంక్షేమ సారథి జగనన్న వైపే చూశాయి..
వేలాది చేతులు ఆయన స్పర్శ కోసం తహతహలాడాయి..
ఆయన మాట కోసం చెవులూరేలా ఎదురుచూశాయి..
అదే చిరునవ్వుతో జగన్ చేయి ఊపారు..
అదే ఆప్యాయతతో అందరి గుండె తట్టారు..
అదే మమకారంతో భరోసా ఇచ్చారు..
విశాఖ తూర్పు మురిసేలా ఉత్సాహపరిచారు..
చల్లని వాతావరణంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర తూర్పు నియోజకవర్గంలో విజయవంతంగా సాగింది.


ఇసుకతోట జంక్షన్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

- మేమంతా సిద్ధం బస్సు యాత్రకు తూర్పు ప్రజల నీరాజనం
- దారి పొడవునా సీఎంకు ఘన స్వాగతం
- వార్డుల వారీగా భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆరిలోవ/మధురవాడ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆదివారం తూర్పు నియోజకవర్గంలో దిగ్విజయంగా సాగింది. కూడళ్లు ఇసుకేస్తే రాలనంతగా జనంతో కిక్కిరిశాయి. జన ప్రభంజనం ముందు ఆ సూర్యుడు కూడా చల్లబడిపోయాడు. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో చల్లగా మారడంతో ప్రజలు రోడ్లకిరువైపులా బారులుతీరి జగనన్న రాక కోసం ఎదురు చూశారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో 15 వార్డుల నుంచి వేలాది మంది ప్రజలు ఇసుకతోట కూడలికి చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రజలు బస్సు యాత్ర కోసం తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేత పట్టుకొని సీఎం జగన్‌కు జేజేలు పలుకుతూ హైవేపై బారులు తీరారు. రాత్రి 8.15 గంటలకు ఇసుకతోట కూడలికి బస్సు యాత్ర చేరుకుంది. అంతవరకు ఎంతో ఓపికతో అభిమానులు నిరీక్షించారు. ముఖ్యమంత్రి రాగానే స్వాగతం పలికారు. మళ్లీ మా సీఎం మేరే అంటూ నినాదాలు చేశారు. ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం చేశారు. బస్సు నుంచి కిందకు దిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. పలువురి నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విన్నారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. దీంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి బస్ యాత్ర వెంకోజీపాలెం, హనుమంతవాక, డెయిరీ ఫారం మీదుగా భీమిలి నియోజకవర్గంలోకి ప్రవేశించింది.

గుమ్మడి కాయలతో దిష్టి

17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య స్థానిక మహిళలతో కలిసి ఇసుకతోట కూడలి వద్ద పూలు చల్లి, గుమ్మడి కాయలతో దిష్టి తీసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వారిని చిరునవ్వుతో పలకరించి అభివాదం చేశారు.

భీమిలిలో ప్రవేశం

విశాఖ వేలీ స్కూల్ వద్ద భీమిలి నియోజకవర్గంలోకి ప్రవేశించిన బస్సు యాత్రకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఇందిరాగాంధీ జూ పార్కు, ఎండాడ పెట్రోల్ బంక్, ఎండాడ కూడలి, దిశ పోలీస్ స్టేషన్, లా కళాశాల కూడలి మీదుగా ఎండాడ వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి చేరుకొంది. నియోజకవర్గంలో దారి పొడవునా అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పూలతో స్వాగతం పలికారు.

ఎంవీపీ కాలనీ/ఏయూ క్యాంపస్/మద్దిలపాలెం/బీచ్‌రోడ్డు: పేదల గుండె చప్పుడు, ప్రజా సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేము సిద్ధం బస్సు యాత్రకు విశాఖ తూర్పు నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రహదారులు జనోత్సాహంతో కిటకిటలాడాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో వైఎస్సార్‌సీపీ పాలనపై చైతన్యం తెచ్చే దిశగా ముఖ్యమంత్రి జగన్ మేమంతా సిద్ధం పేరిట తలపెట్టిన బస్సు యాత్ర ఆదివారం నగరంలో సాగింది. ఇందులో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గం మీదుగా ఈ యాత్ర సాగడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఆనందోత్సాహంతో పరవశించారు. దారిపొడవునా సీఎం జగన్‌కు, గత ఐదేళ్ల ప్రజా రంజక పాలనకు జేజేలు కొట్టారు.

అన్ని దారులు యాత్ర వైపు

వైఎస్ జగన్ బస్సు యాత్రకు 17, 18, 19 వార్డుల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. సాయంత్రం 4 గంటల నుంచి వార్డుల వారీగా ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా ముందుకు సాగారు. 17వ వార్డుకు చెందిన కార్యకర్తలు ఆదర్శనగర్ ముఖ ద్వారం వద్ద నుంచి కార్పొరేటర్ గేదెల లావణ్య సమక్షంలో ర్యాలీగా బయలుదేరారు. 18, 19 వార్డులకు చెందిన కార్యకర్తలు, పార్టీ అభిమానులు అప్పుఘర్, పెదజాలరిపేట ప్రాంతాల నుంచి భారీగా ఆటోలు, బైక్ ర్యాలీగా ఇసుకతోట కూడలికి చేరుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఇసుకతోట కూడలి జనసంద్రంలా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యాత్రకు ఘన స్వాగతం పలికారు.

యువత భారీ బైక్ ర్యాలీ

పెదవాల్తేరులోని విశాఖ ఐ హాస్పిటల్ కూడలిలోని స్థానిక 20వ వార్డు కార్యాలయం వద్ద సుమారు 500 మంది యువకులు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా తరలివెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు. మేమంతా సిద్ధం అంటూ జెండాలు పట్టుకుని, జై జగన్ నినాదాలతో ముందుకు సాగారు. పెదవాల్తేరు, చినవాల్తేరు, శివాజీ పాలెం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు బస్సు యాత్రను వీక్షించడానికి వెళ్లారు.


17వ వార్డు ఆదర్శనగర్ నుంచి ర్యాలీగా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న జనం

భారీ బైక్ ర్యాలీ

➡ జీవీఎంసీ 28వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో సుమారు 200 బైకులతో ర్యాలీ నిర్వహించారు.

➡ జీవీఎంసీ 22వ వార్డు నుంచి రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకులు, ఆటోల ద్వారా అక్కయ్యపాలెం వెళ్లి సీఎం జగన్‌కు స్వాగతం పలికారు.

జన సంద్రంగా ఇసుకతోట జంక్షన్

సీఎం జగన్ బస్సు యాత్ర కారణంగా జాతీయ రహదారి అశేష జనవాహినితో నిండిపోయింది. మహిళలు వైఎస్సార్‌సీపీ జెండా చేతపట్టి సీఎం జగన్‌కు జేజేలు పలికారు. ఇసుకతోట జంక్షన్ ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ జగనన్నను చూసేందుకు తరలివచ్చారు. నీవే మళ్లీ మా కాబోయే సీఎం అంటూ ముక్తకంఠంతో నినదించారు. యువతీ, యువకులు, బస్సు వెంట పరుగులు తీశారు.

➡ 16వ వార్డు నుంచి కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పార్టీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మద్దిలపాలెం నుంచి బస్సు యాత్రకు స్వాగతం పలికారు.

➡ 15వ వార్డు నుంచి కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో జనం ఇసుకతోట జంక్షన్ నుంచి ఉమానగర్ కాలనీ, వెంకోజీపాలెం మధ్యలో పార్టీ జెండాలతో సీఎం జగన్‌కు స్వాగతం పలికారు.

➡ 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డితో పాటు వార్డులో మహిళలు బస్సు యాత్రకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మద్దిలపాలెం కూడలి నుంచి ఆటోమోటివ్ వరకూ రోడ్డు పక్కన నిల్చుని జైజగనన్న అంటూ నినాదాలతో హోరెత్తించారు.


సీఎం జగన్ మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో అభిమానులు


సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఇసుకతోట వద్ద కేరళ సంప్రదాయ డ్రమ్ములతో స్వాగతం


సీఎం జగన్‌కు కార్పొరేటర్ లావణ్య ఆధ్వర్యంలో గుమ్మడి కాయలతో దిష్టి తీసేందుకు వచ్చిన మహిళలు

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి..



గత ఐదేళ్లలో మునుపెన్నడూ లేనంత సంక్షేమ పాలన రాష్ట్రంలో సాగింది. నిజానికి వైఎస్ జగన్ పాలన ఐదేళ్లు అయినప్పటికీ రెండేళ్లు కరోనా సమస్యతోనే గడిచిపోయింది. అప్పుల రాష్ట్రం, పైగా కరోనా కల్లోలం.. వీటన్నింటిని అధిగమించిన సీఎం జగన్ రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా నడిపించిన తీరు అద్భుతం. చిత్తశుద్ధితో అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే మరోసారి సీఎంగా జగనే రావాలి.

– జి.నాగరాజు, చినవాల్తేర్

విశాఖ కోసం.. జగనే కావాలి



దశాబ్దాలుగా వలస పాలకుల చేతుల్లో విశాఖ నలిగిపోతుంది. విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన నాయకులు ఎవరూ లేరు. అలాంటి పరిస్థితుల్లో ఎవరూ అడక్కపోయినా విశాఖపై ఉన్న అభిమానం, అంతర్జాతీయంగా ఎదుగేందుకు విశాఖకు ఉన్న సత్తాను గుర్తించి సీఎం జగన్ విశాఖను రాజధానిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో విశాఖ భవిష్యత్ కోసం సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాను.

– ఎ.రాము, సింహాద్రిపురం

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తాయ్..



వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం. గత ఐదేళ్లుగా సీఎం జగన్ అందించిన సంక్షేమ పాలన, అభివృద్ధే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయి. ఈ సారి అధికారంలోకి వస్తే ప్రజలకు అనేక వరాలు ఇస్తాం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చినప్పుడు ఎందుకు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. పవన్ కల్యాణ్ సినిమాలకు తప్ప రాజకీయాలకు, ప్రజా ఆకాంక్షలు తీర్చడానికి పనికిరాడు.

– దివ్యభవానీ, ఇసుకతోట

జగన్ అంటే అభిమానం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఎంతో అభిమానం, అందుకే ఆయనను చూడడానికి వెళుతున్నాను. రాష్ట్రంలో ప్రజలందరి సంక్షేమం కోసం ఆలోచించి, మంచి సంక్షేమ పథకాలను అమలు చేశారు. తొలిసారిగా ప్రత్యక్షంగా చూడడానికి వెళ్తున్నాను.

– పెంద్యాల భక్త తుకారాం, పెదవాల్తేరు

సంక్షేమ ప్రదాతను చూశాం..



పేదల జీవితాల్లో ఆనందం నింపిన సంక్షేమ ప్రదాతను కళ్లారా చూశాం. ఎంతో ఆనందంగా ఉంది. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే అవుతారనేది ఆయన ముఖంలోనే కనిపిస్తుంది. మళ్లీ సీఎం చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అశేషంగా తరలివచ్చిన జనమే దీనికి నిదర్శనం.

– దర్మాల గోవిందమ్మ, మద్దిలపాలెం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి 100 మంది టైలర్లు


టైలర్లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 100 మందికి పైగా టైలర్లు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం 19వ వార్డు పెదజాలరిపేట డిపో సమీపంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి ఎంపీ, పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా రంజక పాలన, అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు వెల్లడించారు. విశాఖ జిల్లా ప్రైమరీ టైలరింగ్ కో–ఆపరేటివ్ సొసైటీకి చెందిన 100 మందికి పైగా టైలర్లు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని కోరారు.

వైభవంగా సంస్కృత భారతి జానపద సమ్మేళనం


విశాఖ సంస్కృతిక జానపద సమ్మేళనంలో ప్రముఖులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షి నగర్‌లోని బీవీకే కళాశాలలో ఆదివారం విశాఖ సంస్కృత భారతి జానపద సమ్మేళనం ఘనంగా జరిగింది. జిల్లాలో సంస్కృత భాష అభిమానులు సుమారు 300 మంది వరకు పాల్గొనడంతో ఈ సమ్మేళనం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకగా సాగింది. సంస్కృత విజ్ఞాన ప్రదర్శన, వస్తు ప్రదర్శన, పుస్తక ప్రదర్శన, రసాయనాలు లేని ఆయుర్వేద వనమూలికల నుంచి తీసి అద్దిన రంగులతో తయారు చేసిన వస్త్రాలు, ఆహార దివ్య, తదితర విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారు లు సంస్కృత భాషలో హాస్య నాటికలు, నృత్యాలు, గీతాలతో అలరించారు. ఈ సందర్భంగా సంస్కృత భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సుందర్‌రాజ పెరుమాళ్ మాట్లాడుతూ సంస్కృత భాష వాఙ్మయంలో మానవ స్థితి నుంచి దైవ స్థితికి ఎదగడానికి అవసరమైన జ్ఞాన సర్వస్వం ఉంటుందన్నారు. సంస్కృతం నేర్చుకోవడం ద్వారా ఉన్నత స్థితికి వెళ్లవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ కార్య దర్శి పి.సోమరాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి భాగవతుల శ్రీరామమూర్తి, ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నాడీ వ్యవస్థకు వ్యాయామమే దివ్య ఔషధం


మాట్లాడుతున్న డాక్టర్ దేముడు

బీచ్ రోడ్డు: వ్యాయామమే నాడీ వ్యవస్థ సక్రమంగా పని చేయడానికి దివ్య ఔషధమని న్యూరాలజిస్ట్ డాక్టర్ దేముడుబాబు తెలిపారు. ప్రపంచ పార్కిన్సన్స్ డేను పురస్కరించుకుని ఆదివారం సీషోర్ వాకర్స్ క్లబ్, సిప్లా సంస్థ సంయుక్తంగా బీచ్‌రోడ్డులో అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల వయస్సు దాటిన వారిలో నాడీ కణాలు మెదడును దెబ్బ తీయడం ద్వారా పార్కిన్సన్స్ (వణుకుడు రోగం) వస్తుందన్నారు. నిరంతరం వ్యాయామం చేస్తే కొంత వరకు సమస్యను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.రంగారావు, సీ షోర్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఎం.ఎస్.నాయుడు, సిహెచ్.శ్రీనివాసరాజు, సిప్లా రీజనల్ మేనేజర్ సిహెచ్.రవి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ముమ్మర ప్రచారం


16వ వార్డులో కేఆర్‌ఎం కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ


ప్రచారం చేస్తున్న 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ 16వ వార్డులో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పార్టీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావుతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జేసీఏ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా నాయకులు, కస్టర్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆదివారం 197 బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాపాక శ్రీనివాసరావు, కోన కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన


నాడు : ప్రభుత్వ వసతి గృహాలు


నేడు : ప్రభుత్వ వసతి గృహాలు

మహారాణిపేట : పలు ప్రభుత్వ శాఖలకు చెందిన సంక్షేమ వసతి గృహాలకు మౌలిక సదుపాయాలు కల్పించారు. తొమ్మిది సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, 5 వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఒక గిరిజన సంక్షేమ వసతి గృహానికి రూ.5 కోట్ల 63 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు 18 నెలల్లో అధికారులు ఈ పనులు పూర్తి చేశారు. ఆధునికీకరించిన వసతి గృహాల్లో మొత్తం 1950 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విశాఖ విద్యా వసతి వికాసంలో భాగంగా ఆదివారం 250 మంది విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా మూడు ప్రభుత్వ వసతి గృహాల పనులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగదాంబ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. హార్బర్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం 12.50 గంటల సమయంలో దాదాపు 50 సంవత్సరాలున్న వ్యక్తి కాన్వెంట్ జంక్షన్ నుండి షీలానగర్ వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఆ వ్యక్తి శరీరం నుజ్జయిఅతను మృతి చెందాడు. 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు, తెలుపు, నీలం చారల షర్టు, నల్ల ఫ్యాంట్ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796013 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

సర్వజన మనోరంజని వాహనంపై సింహాచలేశుడు


తిరువీధిలో కళాకారుల నృత్య ప్రదర్శన

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామి వారికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలను సర్వజన మనోరంజనిపై అధిష్ఠింపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా జరిగిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సాయంత్రం సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం


కూచిపూడి నృత్యంతో ఆకట్టుకున్న జిల్లా బాలభవన్ విద్యార్థులు

అల్లిపురం : బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం సాయంత్రం జిల్లా బాలభవన్ విద్యార్థుల కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆచార్యులు లలిత ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం తిలకించిన వారంతా భక్తిపారవశ్యంతో తరించారు.